

# ఇన్‌సైడర్

చింతపట్ల సుదర్శన్

ఒక్కటంటే ఒక్కమబ్బు కూడా లేని ఆకాశం. తెలుపూ లేదు నీలమూ లేదు. అసలే రంగులో వుందో తెలీడానికి చంద్రుడూ లేడు. అక్కడోటీ ఇక్కడోటీ కనీ కనిపించని నక్షత్రాలు.

పొద్దుట్నించీ పెట్రోలు తాగుబోతుల్ని మోసి అలసిపోయిన రోడ్లు నిద్రపోవడానికి ట్రై చేస్తున్నా అక్కడో యిక్కడో హారను మోతకి వులిక్కి పడుతూనే వున్నాయి.

చీకట్లో సర్రుమని తన పక్కనించి వో కారు దూసుకుపోడంతో వొళ్లంతా వొణికిపోతూ నుంచున్న వొంటరి కుక్కొకటి చిర్రెత్తి, మోరెత్తి భౌ మనాలని విఫలమయి ఏడుపురాగం అందుకుంది.

గడియారాల్లో ముళ్లు రెండు చేతులూ జోడించి మరో కొత్త రోజుకి వెల్‌కం చెప్పేయి.

ఫ్రెండ్స్ అవిన్యూ. నాలుగో అంతస్తు అపార్ట్‌మెంట్. బెడ్‌రూంలో కప్‌బోర్డ్సూ, అలమరా మంచం అన్నీ నిద్దర్లో వున్నాయి. ఒక్క ఫాన్ తప్ప. మంచం మీద యిప్పటిదాకా నిద్దరపోతున్న మనిషి కరెంట్ షాక్ కొట్టినట్టు లేచి కూచున్నాడు. రోడ్డువైపు వున్న గోడకి కళ్లలా రెండు కిటికీ లున్నాయి. వాటిల్లో ఒకటి బోల్టు సరిగ్గా లేకపోవడం వల్ల గాలిచేస్తున్న ర్యాగింగ్‌కి తట్టుకోలేక ఫట్‌ఫటాఫట్‌మని కొట్టుకుంటున్నది.

మంచం పక్కన చిన్న టేబిల్ వుంది. దానిమీద చచ్చినట్టు పడున్న సెల్‌ఫోన్ స్క్రీన్ మీద వెలుతురు... పీక తెగ్గోస్తున్నపుడు ఏ మనిషయినా అరిచే అరుపు...

ఆ అరుపే మంచం మీద మనిషిని నిద్దర్లేపింది. నిద్దర్లేచిన మనిషి వళ్లంతా చెమట. గాలికి ఎగిరే క్యాలెండర్ కాగితంలా వణుకు. సెల్‌లో అరుపు ఆగిపోయినా వెలుతురు అట్లాగే వుంది. 'తప్పదు' అనుకుంటూ చేయి చాచి సెల్ అందుకున్నాడు.

స్క్రీన్ మీద అల్లుకుపోయిన ఎర్రటి అంకెలు. ఆ మనిషి మొహం ఎర్రటి అంకెలు చూడగానే తెల్లబడింది. నరాల్లోంచి బైటికి పారిపోడానికి దారి వెతుకుతూ నెత్తురు పిచ్చిపట్టినట్టు పరుగెత్తసాగింది. ఆ సెల్ ఎవరితోనూ మాట్లాడటానికి పనికిరాదు. ఆన్ చేసి చెప్పదల్చుకున్నది గుసగుసగా చెప్పడమే. చెప్పడమంటే అడగడం... ఏంకావాలో అడగడం. ఏదైనా అడగచ్చు. అలాగని ఎప్పటికీ అట్టే పెట్టుకోలేం. ఇప్పుడు కనపడ్డట్టు అల్లుకుపోయిన ఎర్రటి అంకెలు మూడు రాత్రుళ్లు కనపడితే... ప్రాణం పోవడమే. అంకెలు రాకుండా వెలిగినప్పుడే ఏదైనా కోరుకోడం.

అనుకోకుండా అతని చేతికి వచ్చిందది. నాలుగు వేలకి కొన్నాడు. అమ్మినవాడు ప్రాణం పోకుండా కాపాడుకునేందుకు అమ్మాడు. కొన్నవాడు కోరినదిస్తుందని కొన్నాడు. అతను కోరుకున్నదొకటి, జరిగింది కూడా. కానీ... ఇప్పుడు... వదిలించుకోవాలి... తక్షణం వదిలించుకోవాలి. ఇంకా ఏవేవో కోరుకోవాలనుకున్నాడు... కానీ ప్రాణం ముఖ్యం కదా... ఎవరికైనా సగం ధరకి అమ్మేయాలి.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు.

*

భూమి మళ్లీ తన చుట్టూ తాను వో రౌండు వేసుకుంది. మంచం మీద బోర్లా పడుకుని వున్న భార్గవ్ 'అయాం ఆపుల్లీ టైర్డ్' అనుకున్నాడెన్నోసారో. దిండులో తలదూర్చి నిద్రపోదామని చూస్తున్నాడు కానీ కడుపులో

పెట్రోల్ బంకేదో తగలబడి పోతున్నట్టుంది. ఫైరింజన్ చప్పుడులా సెల్‌ఫోన్ మోగింది.

ఇది 'ఆ' సెల్ కాదు. అదిప్పుడు లేదు. తన బ్లాక్ బెరీ. ఇంత రాత్రి ఎవరు అనుకున్నాడు. ఎంత రాత్ర యిందో తనకీ తెలీదు. తను గడియారం కాదుగదా!

ఫోన్ అందుకుని కట్ చేద్దామనుకున్నాడు. పేరు చూసి వేడి నీట్లో చేయి పెట్టినట్టు ఎగిరి కూచున్నాడు.

'పల్లవి.'

"హాయ్ పల్లూ!"

"షటప్."

"చెప్పు పల్లవీ."

"పొద్దుట్నించీ ఎక్కడ బతికావ్?"

"ఎక్కడంటే?"

"ఆఫీసులో లేవు కదా సాఫ్ట్‌వేర్ క్రీచర్."

"హేడ్ సం అర్జంట్ వర్క్."

"ఫోన్ రిసీవ్ చేసుకోడానిక్కూడానా? థౌజండ్ టైమ్స్ చేశాను."

"టూమచ్. కౌంటింగ్ సరిగ్గా చేసుండవు... ఒక్క టంటే వందా?"

"తొక్కలో జోకులొద్దు"

"మొఖం ముడవకట్లా. సైలెంట్‌లో వుంది సారీ... వెరీసారీ... సో సారీ."

"స్టుపిడ్... ఇడియట్... ఇంత కేర్‌లెస్ మనిషిని తగులుకున్నందుకు నన్ను నేను కొట్టుకోవాలి."

"దేంతో? సారీ అన్నా కదా. సంగతేంటో చెప్పు."

"ఇవాళ కాదు... కాదు... పాతికేళ్ల కిందట ఈ రోజున ఈ లోకంలో వో దుర్మార్గుడు జన్మించాడు."

"రియల్లీ... నేనేనా? హేపీ బర్త్‌డే చెప్పెయ్యమ్మా నిద్దరొస్తోంది."

"కాండిల్సూదడం.. కేక్ కట్ చెయ్యడం.. ట్రీట్.. ఏమిలేదా? నీ కంటికి ఎలా కనబడ్తున్నాన్నేను?"

"పల్లవీ నువ్వు కనబడ్డంలేదు... వినపడ్తున్నా వంతే!"

"నువ్వు కాస్సేపు నోరు మూసుకుంటే కన పడ్తాను. లిఫ్టు దగ్గరున్నాను"

మంచం మీదనించి కిందికి గెంతాడు భార్గవ్.

"వాట్... ఆర్ యూ సీరియస్!"

అవతలి పక్క ఫోన్ కట్టయ్యింది.

డోర్ బెల్ మోగింది. భార్గవ్ డోర్ తెరిచాడు. అతన్ని తోసుకుంటూ లోపలికి వచ్చింది పల్లవి. పెద్ద బ్యాగు నేల మీద ఈడ్చుకుంటూ.

"నిజంగానే వచ్చేశావా! ఎప్పుడుపడితే అప్పుడు పోయే పవర్ యిప్పుడెందుకు పోదో," అన్నాడతను ట్యూబ్‌కేసి చూస్తూ.

"ఏం? ముద్దుపెట్టుకుందామనా?" అంది పల్లవి సోఫాలో కూచుంటూ.

"కాదు! నీ కోపం కనపడకుండా వుంటుందని," అన్నాడతను డోర్ వేసి వస్తూ.

"బర్త్‌డే కనక వదిలేస్తున్నా! ఏంటా ముఖం మెడ మీద నిలబడక పక్కకు వేలాడుతోంది. పొద్దుట్నించీ ఏమైనా తిన్నావా?"

"చెప్పాను కదా! సంథింగ్ అర్జంట్..." నసిగాడు భార్గవ్.. "మర్చిపోయాను."

"హఠాత్తుగా ఇంటికి వస్తే ఇంత అగ్లీగా వుంటా వని తెలిస్తే ఆ నలుగురిలో ఎవరో వొకర్ని చూసుకుని వుండేదాన్ని."

"ఎవరా నలుగురు?"

"నేనంటే పడిచచ్చినోళ్లు. డోంట్ వేస్ట్ టైం. పదంటే పది నిమిషాల్లో బాత్రూంలోంచి ప్రిన్స్ ఛార్లెస్‌లా రావాలి. క్విక్... యువర్ టైం స్టార్ట్స్ నౌ."

భార్గవ్ మొదట బెడ్రూంలోకి తర్వాత బాత్‌రూం లోకి జంపయ్యేడు.

అదిరిపోయాడు హాల్లోకి అడుగుపెట్టి. చిక్కటి చీకటి.. దాన్ని చీలుస్తూ... టేబుల్ మీద వెలుగుతున్న కొవ్వొత్తులు.. కేక్.. బర్త్ డే కేక్.

"పవర్‌పోయిందా?" అన్నాడు భార్గవ్ కళ్లకి చీకట్ని అలవాటు చేస్తూ.

"స్విచ్ ఆఫ్ చేస్తే పోతుంది. కం.. ముందు కేక్ కట్ చెయ్యి," అంది పల్లవి. ఆ డిమ్ లైట్లో ఆమె ముఖంలో అందమైన షేడ్స్‌ని చూస్తూ వచ్చాడు భార్గవ్.

కేక్ కట్ చేసే ముందు పల్లవి వెలిగిస్తే సిగ్గుతో ముడుచుకున్న లోటస్ వెలుగులు జిమ్ముతూ రేకులు విప్పింది.

కట్ అయిన కేక్ పల్లవి నోట్లోకి జారిపోతుంటే ఓ చిన్న ముక్క తమాయించుకుని ఆమె పెదాలకి అంటుకుంది.

ఆమె తన నోటికి అందించిన కేక్ గొంతులోకి జబర్దస్తీగా దిగుతుంటే ఆమె పెదాలకి అంటుకున్న కేక్ వైపు ముఖం చాచాడు భార్గవ్.

"థ్యాంక్యూ! థ్యాంక్యూ థౌజండ్ టైమ్స్!" అన్నాడు ఆమె చెవి దగ్గర కితకితగా.

"ఎగ్జయిట్‌మెంటా?"

''ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు! ఇట్స్ ఫాబ్యులస్... ఫాంటాస్టిక్.''

- యింకా ఏదో అందామనుకున్నాడు కానీ ఆమె పెదాల మీది కేక్ యిప్పుడతని చెంప మీదకి దూకింది.

తర్వాత లైట్ వెలుతుర్లో యిద్దరూ డిన్నర్ చేశారు. పొద్దుట్నించీ ఏమీ తినలేదతను. ఆకలి డొక్కలో లాగి పెట్టి తంతుండడంతో ఫిఫ్టీ కేజీ తాజ్‌మహల్ పక్కనున్న విషయం కూడా పట్టించుకోకుండా తినేశాడతను. నాప్‌కిన్‌తో చేయి తుడుచుకుంటూ ''బేకర్స్ క్యూ నించి యిన్ని మోసుకొచ్చావా?'' అన్నాడు.

''నేను తిన్నానో లేదో నోటీస్ చెయ్యకుండా ఏమిటా తిండం,'' అంది పల్లవి అతని వీపుమీద అర చేత్తో ఒక్కటిచ్చి. ''నీకు తొందరగా మ్యానర్స్ నేర్పాలంటే... ఐ షుడ్ బి కాల్డ్ పల్లవీ భార్గవ్... ద సూనర్ ద బెటర్,'' అందామె సింకు దగ్గర చెయ్యి కడుక్కుని వస్తూ

''నో ప్రాబ్లమ్ బేబ్. ఎట్లాగూ మీవాళ్లూ మా వాళ్లు రారు కదా! లెటజ్ డిసైడ్ అవర్ డెస్టినీ...'' అన్నాడతను సోఫాలో రిలాక్స్‌డ్‌గా కూచుంటూ.

అతని పక్కనే వచ్చి కూచున్న పల్లవి, ''లేట్ చెయ్యకు. లగేజ్‌తో దిగిపోతా... పిల్లలు పుట్టాక వెడ్డింగ్ బావుండదు,'' అంది అతని తొడ మీద గిల్లుతూ.

''అబ్బా!'' అనరిచాడతను. ''ఈ పించింగ్ నావల్ల కాదు.. నువ్వు నాకొద్దు,'' అన్నాడు, ఆమె చేతిని పక్కకి తోస్తూ.

''వద్దూ! యిన్నాళ్లూ నా వెంట తిరిగి ఏమేం చేయకూడదో అన్నీ చేసి యిప్పుడు వద్దంటే టీవీ నైనే నా గతి,'' అందతని కాలర్ పట్టుకుని.

''వోకే... బాబా... వోకె! గిల్లు, గిచ్చు, కొరుకు ఏమైనా చేయి. దిస్ హోల్ బాడీ ఆఫ్ సిక్స్‌టీ ఫైవ్ కేజీ ఈజ్ యువర్స్,'' అన్నాడతను ఆమె పెదవి కోసం వెదుకుతూ.

''నో యూజ్! నో గేమ్స్! నీతో పాటు ఈ ఎవిన్యూలో వో అపార్టుమెంట్‌లో నా ఫ్రెండ్ నళినితో కల్సి వుంటున్నదెందుకనుకుంటున్నావ్? టు సీ యువర్ ఎండ్ యాజ్ మై హజ్బెండ్. నళినిదసలే మొద్దునిద్ర ఒకపట్టాన నిద్దర్లేవదు... సీ యూ...'' అంటూ డోర్ దగ్గరికి వెళ్లిందామె.

''ఇఫ్!... ఐ సే ఇఫ్! నళిని డోర్ తెరవలేదనుకో...'' అన్నాడతను కనుబొమ్మల్ని రిథమిక్‌గా పైకీ కిందికీ కదిలిస్తూ.

''మళ్లీ వచ్చి నీ పీక పిసుకుతాను!'' అంటూ బయటికి నడిచింది పల్లవి, భార్గవ్ ఆమె వెనకాలే వెళ్లి డోర్ మూసేప్పుడు జబ్బ పట్టుకుని వెనక్కి లాగాలనుకుంటుండగానే ఆమె వెళ్లిపోయింది.

డోర్ మూసి వచ్చి మంచం మీద పడుకున్నాడు భార్గవ్. ఇప్పుడు ఎంతో హాయిగా వుంది. నిన్నటి టెన్షన్ పూర్తిగా వైపౌవుట్ అయిపోయింది. 'మైగాడ్! ఆ సెల్‌ని వదిలించుకున్నాను. పల్లవీ... డియర్... యూవిల్ సూన్ బి ద సి.ఇ.వొ. ఆఫ్ మై బెడ్‌రూం,' అనుకుంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు.

*

కోడి కూసింది... గడియారంలో. స్ట్రాబెరీ ఐస్‌క్రీం లాంటి స్వీట్ డ్రీం కరగి పోయింది. ఆఫీసుకి లేటయిపోతుందన్న భయంతో ఇష్టం లేకపోయినా లేచి వళ్లు విరుచుకున్నాడు భార్గవ్. రోడ్ల మీద ట్రాఫిక్ తప్పించే గుండెలయ గుర్తుకు వచ్చి స్నానానికని డక్‌రూంలో దూరాడు. తియ్యటి బ్రష్ నములుతూ అద్దం ముందు నిలబడి గడ్డం తడుముకున్నాడు. గాజుపొడిలా గుచ్చుకుంటోంది. పల్లవి కిష్టం వుండదు. సో... తన ఒకప్పటి ఫ్యాషన్, ఫ్రాన్స్‌గాల్లో కల్సిపోయింది. బ్రషింగూ, షేవింగూ అయ్యాక అరచేత్తో చెంపలు తడుముకుంటూ, 'యూ ఆర్ ఛార్మింగ్ మై హీరో,' అనుకున్నాడు. కుడిచెవి కింద నించి ఎడంచెవి కిందకి వేళ్లతో నడిచాడు. హఠాత్తుగా కంటి కింద చీక్‌బోన్ దగ్గర వున్న వో మచ్చ మీద పడిందతని దృష్టి. స్టన్నయిపోయేడు. యిది ఎక్కడ్నించి వచ్చింది. ఎప్పుడూ కనబడలేదు. యిదివరకు వుందా?... నో... అనుకుంటూ వుంటే కింది పెదవి కింద కూడా అలాంటిదే వో మచ్చ. ఈసారి గుండె రేసుగుర్రమయింది. ముఖాన్ని నీళ్లతో తడిపి టవల్‌తో తుడుచుకుంటూ హాల్లో అద్దం ముందుకు వచ్చాడు. చూడకూడదనుకుంటూనే మరోసారి చూశాడు. నీరసంగా వెళ్లి సోఫాలో కూలబడ్డాడు. ఐదు నిమిషాల కింద లేని నీరసం. ఐదు నిమిషాల్లో తన లైఫ్ బోటుకి చిల్లు పడిందన్న ఫీలింగ్. యస్... గ్రాండ్‌ఫాదర్‌కి వుండేది లూకోడర్మా! హెరిడిటరీ! నో... ఏంలేదు... ఏం కాదు... యు ఆర్ అన్‌నెససరిలీ స్కేర్డ్ అనుకున్నాడు. తనకు తెలీకుండానే మళ్లీ అద్దంముందు నిలబడ్డాడు. మచ్చల్ని మైక్రోస్కోప్ కళ్లతో చూశాడు. తెల్లగా... అంటుకున్న పాలచుక్కల్లా వున్నాయి!

కంప్యూటర్ దగ్గరికి పరుగెత్తాడు. హెల్త్‌కి సంబంధించిన అనుమానాలేమైనా వస్తే కంప్యూటరే ఎడ్యుకేట్ చేస్తుంది తనని. డాక్టర్లంటే భయం... అనుమానం... మందులంటే చిరాకు... లూకోడర్మా వికీపీడియా

చూశాడు. హెరిడిటరీగా వచ్చే ఛాన్సు లేకపోలేదు. మచ్చలు తెల్లగానే వున్నయి. దేర్ ఈజ్ 'నో' క్యూర్ అన్న వాక్యం చూడగానే కళ్లు రివాల్వింగ్ ఛైర్లయినయి.

ఏ కదలికా లేకుండా సోఫాలో కూచుండి పోయాడు చాలాసేపు. మూడు రెక్కలూ కనిపించ కుండా ఫ్యాన్ గుండ్రంగా ఎలా తిరుగుతుందో గమనిం చాడు. ఏం చేయాలి? ఏం చేయాలేం చేయాలేం? డెఫినిట్‌గా యిది తాత దగ్గర్నించి సంక్రమించిన బయో లాజికల్ ప్రాపర్టీనే అనుకున్నాడు. చల్లబడిపోతున్న బాడీలోకి వో ఆలోచన సూర్యుడు పారేసిన కిరణమయి గుచ్చుకుంది. అదొక్కటే సొల్యూషన్. లేకపోతే ఈ అంద మైన చర్మం చెక్కు తీసిన కందగడ్డలా... హారిబుల్. సోఫాలో పడి అటూఇటూ దొర్లుతూ మళ్లీ అను కున్నాడు. అదొక్కటే సొల్యూషన్... సెల్... మై మ్యాజి కల్ సెల్... యు వోన్లీ కెన్ సేవ్ మీ... అనుకుంటూ లేచి నిలబడ్డాడు.. నిన్నంతా పిచ్చికుక్కలా తిరిగి వది లించుకొచ్చిన సెల్‌కోసం రన్నింగ్ మొదలెట్టేడు.

*

భార్గవ్ అథ్లెట్‌కాడు. ప్రొఫెషనల్ రన్నర్ కాడు. కానీ రన్ చెయ్యక తప్పలేదు. సిటీ ఈ మూలనించి ఆ మూలకి. తన భయం హాకీ బ్యాట్‌లా లాగిపెట్టి కొడుతుంటే బంతిలా ఎగిరెగిరి పడుతూ పరుగెత్తాడు. ఉద్యోగం దొరక్క సూసైడల్ డిప్రెషన్‌లో వున్న ఫ్రెండ్ మురళి తన మాట నమ్మి రెండు వేలకి కొనుక్కున్న సెల్‌ని వేయికి తిరిగి కొనుక్కువచ్చాడు. దాన్ని యిస్తూ మురళి ఈ దరిద్రపు సెల్‌ఫోన్‌ని యిక్కడ్నించి తీసుకుపో అన్నాడు వెర్రెత్తినవాడిలా.

*

''స్టుపిడ్...ఇడియట్...'' అంటూ మంచం మీద వున్న భార్గవ్ మీద కూచుని ఛాతీ మీద అదేపనిగా గుద్దుతోంది పల్లవి.

''అబ్బ... వదులు... రాక్షసీ... తప్పయిపోయింది... అయాం... స్టుపిడ్... ఇడియట్... బట్ ఐ లవ్ యూ...'' అన్నాడతను ఆమె రెండు పిడికిళ్లనూ రెండు చేతుల్తో పట్టుకుంటూ.

''ఏమైపోయావు... కంటికి కనిపించి వారం అయిందా! పారిపోయావనుకున్నాను... ఉద్యోగం వుందా వూడిందా. ఎట్లా పోషిస్తావురా నన్ను... మగడా... మొగుడా...'' అనరిచింది మొహాన్ని రెండు పక్కలనించీ కప్పుతున్న వెంట్రుకల్ని మోచేత్తో పక్కకి తోస్తూ.

''ఆటో నడిపిస్తాను! హమాలీ పనిచేస్తాను! రాళ్లు మోస్తాను... అడుక్కొచ్చి పెడ్తాను... ఐ నో మై రెస్పాన్సిబిలిటీ... కూల్‌డౌన్... పల్లూ ప్లీజ్... యు ఆర్ మై లవ్‌లీ లవ్...'' అన్నాడామె ముఖంలో యింకా ఎర్ర బడకుండా వున్న తెల్లకలువలాంటి గడ్డం పుచ్చుకుని.

''హు!'' అంటూ ముక్కుల్లోంచి వేడిగాలిని విసుర్తూ పక్కకు జరిగింది పల్లవి. ఆ తర్వాత భార్గవ్ చెప్పింది వింది అపనమ్మకంగా... ఆశ్చర్యంగా!

గోవా సైట్ సీయింగ్‌కి వెళ్లినప్పుడు అంజునా బీచ్‌లో నిర్జన ప్రదేశంలో వో అపరిచితుడు భార్గవ్‌కి ఆ సెల్ నాలుగు వేలకి అమ్మాడు. అది అన్ని సెల్‌ఫోన్ల లాంటిది కాదు. అర్ధరాత్రి పన్నెండింటికి మాత్రమే స్క్రీన్ మీద వెలుగు కన్పిస్తుంది. ఆ టైంలో దాన్ని ఎత్తి మనసు లోని కోరిక చెప్పుకుంటే తీరుతుంది. కానీ వెలుగుతో పాటు అల్లుకుపోయినట్టు ఎర్ర అంకెలు మూడుసార్లు కనిపిస్తే మాత్రం అది ఎవరి దగ్గరవుందో వాళ్ల చావు ఖాయం. ఆ లోపునే దాన్ని మరో మనిషికి కొన్న ధరలో సగం రేటుకి అమ్మెయ్యాలి. విషయం నమ్మకపోయినా చూడ్డానికి బాగుందని, ఏం జరుగుతుందో చూద్దామని క్యూరియాసిటీతో దాన్ని కొన్నాడు భార్గవ్. కొన్నాక తానొక డామ్ ఫూల్‌నని వాడెవడో మాటల్తో మత్తు చల్లి తనకి టోకరా ఇచ్చాడనీ అనుకున్నాడు. కానీ ఆ రాత్రే సెల్‌లో లైటు వెలగడంతో ట్రాష్ అనుకుంటూనే తనకి ప్రమో షన్ రావాలని కోరుకున్నాడు. ఆ తర్వాత రెండు రోజు లకే తన క్లోజ్ ఫ్రెండ్ సీనియర్, నాగార్జునసాగర్ వెళ్లి నదిలో పొరపాటున పడి చచ్చిపోవడం తనకి ప్రమోషన్ రావడం జరిగేయి. ఆ మర్నాడు రాత్రే సెల్‌లో ఎర్ర అంకెలు కనపడ్డంతో భయపడి దాన్ని మురళికి అంట గట్టాడు. వరుసగా రెండు రాత్రులు స్క్రీన్ వెలగడంతో ఉద్యోగమూ, కారూ కోరుకున్నాడు మురళి. రెండు రోజులకే సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్న తండ్రి హఠాత్తుగా చనిపోయాడు. ఆ మర్నాడే అన్నయ్య ఏక్సి డెంట్లో ఘోరంగా చనిపోయాడు. మురళికి ఉద్యోగం వచ్చింది. అన్నయ్య కారు యిప్పుడు మురళి దగ్గరే వుంది. తండ్రి చావుకీ అన్నయ్య ఆక్సిడెంట్‌కీ సెల్‌కీ సంబంధం వుందని తెల్సిన మురళికి పన్నెండయితే చాలు ఎర్ర అంకెలు కనపడ్తాయేమోనని సెల్‌ని ఎవరి కయినా అమ్మాలని ప్రయత్నించాడు కానీ అతన్ని ఎవరూ నమ్మలేదు. మురళి దిక్కుతోచని స్థితిలో వున్నప్పుడు మళ్లీ భార్గవ్ దాన్ని తిరిగి కొనుక్కు వచ్చాడు.

కిచెన్‌లోంచి రెండు కప్పుల కాఫీ తెచ్చి అతనికోటి అందించి, ''కాఫీకి మాత్రమే కాదు వంటకీ సరుకులు తెచ్చిపడెయ్యి... వంట రుచి చూశాక పెళ్లి చేసు కుందువు గాని,'' అంది పల్లవి నవ్వుతూ

వాతావరణంలో మార్పు రాలేదు. భార్గవ్ పెదాల లాక్ తీయలేదు. కాఫీ సిప్ చేస్తూ తనూ ఆలోచన్లో పడింది పల్లవి. సెల్ ఫోన్ కాదది... మరణ మృదంగం... డెత్ వారంట్... కోర్కె కోరుకున్నవాడికి సంబంధించిన ఎవరో ఒకర్ని బలి తీసుకుంటుంది. భార్గవ్ క్లోజ్ ఫ్రెండ్ చనిపోయాడు. మురళి తండ్రీ, అన్నా చనిపోయారు. ఎవరికి ఏమైతేనేం తమ కోరిక తీరితే చాలుననుకునే వాళ్లు వుంటారు. అలాంటి వాళ్లకి 'చెక్' పెట్టడానికే ఎర్ర అంకెలూ... మరణమూ... భయంతో వొణికిపోయింది పల్లవి.

"నీకసలు బుద్ధి అనేదే లేదా! వొదిలించుకున్న దాన్ని మళ్లీ ఎందుకు తెచ్చావ్! ప్రాణాల్తో వుందామనే!" అంది కోపంగా.

ఉలిక్కిపడ్డ భార్గవ్ ఎందుకు తెచ్చాడో చెప్పాడు. "స్టుపిడ్... ఇడియట్... ఎవరు చెప్పారు... డాక్టర్ని కన్సల్ట్ చేశావా? నువ్వే కాదు.. చాలామందికి యిదే బుద్ధి. సమస్యలనించి పారిపోవాలి లేదా ఏవేవో మిరాకిల్ జరగాలి... బీ ప్రాక్టికల్... అనవసరంగా టెన్షనవకు."

"ఏం కాదంటావా?" అన్నాడు చిన్నపిల్లాడిలా.

"ఏమీ కాదు! డాక్టర్‌ని కన్సల్ట్ చేస్తే డౌట్ క్లియర్ అవుతుంది. అయినా నాకు నీ ముఖంలో ఏ మచ్చా కనిపించడం లేదు. మునుపటి కంటే అందంగా కన పడుతోంది. ముద్దుపెట్టుకుందామనిపిస్తోంది... కానీ ముందా సెల్ సంగతి సెటిల్ చేద్దాం..."

"ఎవరు కొంటారు?"

"నేను... ఐ... ఐ యామ్ హియర్... నేనూ కంప్యూటర్ లేబర్నే... ఐ హేవ్ మనీ... అయినా ఎంత కావాలి. నాలుగు వేలకి కొని రెండు వేలకి అమ్మి మళ్లీ వెయ్యికి కొన్నావు. ఈ ఫైవ్ హండ్రెడ్ నీది... సెల్ నాది."

"నీకేమన్నా ప్రాబ్లమ్ అవుతుందేమో..." సెల్ అందిస్తూ అన్నాడు భార్గవ్.

"టాంక్‌బండ్ మీద విగ్రహాలని చూడాలని ఎన్నేళ్ల నించో అనుకుంటున్నాను. యిప్పుడు వెళ్తాను."

"టేక్ కేర్..." అన్నాడతను.

"డోంట్ యూ వరీ... బుద్ధుడికసలు కోరికలనేవే వుండవు," అంటూ వెళ్లిపోయింది పల్లవి.

*

హుసేన్‌సాగర్ నీటి అడుగున వున్న ఆ సెల్‌ఫోన్,

అదృష్టాన్నే నమ్ముకున్న వాళ్ల కోసం, జీవితంలో అద్భుతాలు జరగాలని ఆశపడే వాళ్ల కోసం, ఏ స్ట్రగులూ లేకుండా ఎగ్జిస్టు అవాలనే వాళ్ల కోసం, గుర్రాల్లాంటి కోరికలున్న వాళ్ల కోసం ఎదురుచూస్తూ వుంది.

*పాలపిట్ట, నవంబర్ 2010*

